క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. 22న వింజమూరులోని సచివాలయం-1,2, ఊటుకూరు, 23న చాకలికొండ, వింజమూరు-3,4 సచివాలయాలు, 24న కాటేపల్లి, బుక్కాపురం, 25న వింజమూరు సచివాలయం-5, శంఖవరం సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఉంటాయని చెప్పారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా గంధోత్సవం



అనుమసముద్రంపేట: రాజవోలులో ఉన్న మహబూబ్ షరీఫ్ దర్గాలో గంధ మహోత్సవాన్ని సోమవారం వేకువన వైభవంగా నిర్వహించారు. తొలుత గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు చేర్చారు. అనంతరం దర్గాలో ఉంచి ప్రత్యేక ప్రార్థనలు జరిపి భక్తులకు పంచిపెట్టారు. దర్గా వద్ద జెండాను ఆవిష్కరించారు. ఆత్మకూరు దర్గాకు చెందిన పేష్ ఇమామ్ షేక్ మౌలానా ఖమ్రుజమ చేతుల మీదుగా నియాజ్‌కా ఫల్ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి దర్గా వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వించారు.

ట్యాంకర్ బోల్తా

మర్రిపాడు: మండలంలోని కదిరినాయుడుపల్లి సమీపంలోని కేతామన్నేరువాగు బ్రిడ్జి వద్ద ఓ ట్యాంకర్ సోమవారం బోల్తా పడింది. నెల్లూరు నుంచి కడపకు వెళ్తున్న ట్యాంకర్ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి 50 అడుగుల లోతులో ఉన్న సర్వీస్ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఏడీఎంహెచ్ఓ తనిఖీలు

సంగం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టీబీ, లెప్రసి అధికారి, ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలి సోమవారం తనిఖీ చేశారు. అనంతరం రాళ్లచెలిక ప్రాంతంలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలించి ఏఎన్ఎంలకు సూచనలు చేశారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

మురుగు తొలగింపు

సంగం: స్థానిక కెనరా బ్యాంకు సమీపంలో మెయిన్‌రోడ్డుపై మురుగు చేరడంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు వాహనచోదకులు సమస్యను సీఐ వేమారెడ్డి దృష్టికి తీసుకురావడంతో స్పందించారు. స్థానికుల సహకారంతో జేసీబీతో కాలువ తీయించి మురుగును తొలగించారు. దీంతో వాహనచోదకులు, స్థానికులు సీఐకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మర్రిపాడు: స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ముంబై జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు చోటు చేసుకుంది. స్థానిక భారత్ పెట్రోల్‌బంకు యజమాని మధుబాబు స్కూట్లో హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద యూటర్న్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో బెడుసుపల్లికి చెందిన పెంచలనరసింహ బైక్‌పై వస్తూ వెనుకగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మధుబాబు తీవ్రంగా గాయపడగా, పెంచలనరసింహ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు సమాచారంతో క్షతగాత్రులను 108 సిబ్బంది ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వరికుంటపాడు : వరికుంటపాడులో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డిస్కం ఏఈ ఖుద్దూస్‌బాషా సోమవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏఈఓ బాధ్యతల స్వీకరణ

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి నూతన ఏఈఓగా సాంబశివయ్య నియమితులయ్యారు. ఆయన మర్రిపాడు మండలం సింగనపల్లిలో వీఏఏగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. సోమవారం ఆయన ఏఓ చెన్నారెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నారాయణ ఇన్‌సర్వీస్‌లో ఉన్నత చదువులు చదివేందుకు వెళ్లినట్లు ఏఓ తెలిపారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ఆత్మకూరు: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందజేసేఅర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆత్మకూరు ఆర్డీఓ పీ పావని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సంబంధిత మండలాల అధికారులకు ఫోన్ చేసి సమస్యల వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మండల స్థాయిలో పరిష్కరించలేని సమస్యలను డివిజన్ స్థాయికి పంపాలని సూచించారు. సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని ఆదేశించారు.

మూగజీవాలతో ప్రాణసంకటం

- హైవేపైకి నిర్లక్ష్యంగా వదిలేస్తున్న యజమానులు
- పట్టించుకోని హైవే సిబ్బంది
- పగటి వేళ ట్రాఫిక్ .. రాత్రి వేళల్లో ప్రమాదాలకు కారణమవుతున్న పశువులు
- కట్టడి చేయాలని కోరుతున్న వాహనచోదకులు




గేదెను ఢీకొని గాయపడిన ద్విచక్ర వాహనచోదకుడు (ఫైల్),వాహనం ఢీకొని దెబ్బతిన్న గేదె (ఫైల్)

మర్రిపాడు: పశువులు పెంపకందారులు నిర్లక్ష్యం వాహనచోదకులకు ప్రాణసంకటంగా మారుతోంది. హైవేపైకి పశువులను వదలడం వల్ల పగటి వేళల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే కాకుండా రాత్రి వేళల్లో ప్రమాదాలకు కారణాలుగా మారుతున్నాయి. జాతీయ రహదారిపై పశువుల సంచారాన్ని కట్టడి చేయాల్సిన హైవే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వాహనచోదకులు ప్రమాదాల పాలవడమే కాకుండా వాహనాలు దెబ్బతిని ఆర్థికంగానూ నష్టపోయే పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. నెల్లూరు-ముంబై జాతీయ రహదారి మండలంలోని డీసీపల్లి నుంచి సింగనపల్లి వరకు సుమారు 30 కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. జాతీయ రహదారిని అనుకుని చిన్న చిన్న గ్రామాలతో పాటు అటవీ ప్రాంతం ఎక్కువగా ఉంది. పాడి రైతుల పశువులతో పాటు అటవీ ప్రాంతం నుంచి వచ్చే మూగజీవాలు హైవేపైకి వస్తుంటాయి. పగటి వేళ పశువులను ఎలాగోలా వాహనచోదకులు తప్పించుకుని వెళ్లినా రాత్రి వేళల్లో వేగంగా వెళ్లే సమయంలో అడ్డు రావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు చీకట్లో పశువులను గుర్తించలేక ఢీకొని గాయాల పాలవుతున్నారు. పెద్ద వాహనాలు సైతం వాటిని తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తాపడుతున్నాయి. గతంలో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు గేదెలను తప్పించబోయి బోల్తాపడిన ఘటనలో 12 మందికి గాయాలపాలయ్యారు. అదే విధంగా లారీలు, కార్లు సైతం బోల్తా పడిన ఘటనలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు యజమానులు పశువులను నిర్లక్ష్యంగా వదిలేయడంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనచోదకులు ఆవేదన చెందుతున్నారు. హైవే, మండలాధికారులు స్పందించి పశువుల సంచారాన్ని కట్టడి చేయాలని వారు కోరుతున్నారు.

పాడి రైతులకు అవగాహన కల్పిస్తాం

రోడ్లపై మూగజీవాలను వదలకుండా పాడి రైతులకు అవగాహన కల్పిస్తాం. పశువులను హైవేపైకి వదలకుండా గ్రామాల్లో దండోరా వేయిస్తాం. అనంతరం కూడా పరిస్థితి ఇలాగే కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటాం.

–శ్రీనివాసరావు, ఎస్సై మర్రిపాడు

ఈ ఏడాది చోటు చేసుకున్న ప్రమాదాలు..

- జనవరి 13వ తేదీ పడమటినాయుడుపల్లి సమీపంలో ద్విచక్ర వాహనానికి గేదెలు అడ్డు రావడంతో ఢీకొన్ని ఓ వ్యక్తి గాయపడ్డాడు.
- జూలై 15న నందవరం-పొంగూరుకండ్రిక మధ్యన జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన గేదెను ద్విచక్రవాహన చోదకుడు గుర్తించలేక గాయాలపాలయ్యాడు.
- సెప్టెంబర్ 3న నందవరం-పొంగూరుకండ్రిక మధ్యన జాతీయ రహదారిపైకి వచ్చిన గేదెను ఢీకొని కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో గేదె మృతి చెందగా కారు ముందు భాగం ధ్వంసమైంది.
- సెప్టెంబర్ 9న జాతీయ రహదారిపై గేదెను భారీ వాహనం ఢీకొని వెళ్లగా అది అక్కడే మృతి చెందింది. కొన్ని గంటల పాటు హైవే అధికారులు దాన్ని తొలగించలేదు. దీన్ని గుర్తించక ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురయ్యారు. ఈ విషయం మీడియాలో రావడంతో హైవే సిబ్బంది వెంటనే తొలగించారు.
- సెప్టెంబర్ 19న డీసీపల్లి సమీపంలో అకస్మాత్తుగా పంది అడ్డురావడంతో ఢీకొని పడిపోయి ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డారు.
- అక్టోబర్ 20న బ్రాహ్మణపల్లి సమీపంలో జాతీయ రహదారిపై అడ్డు వచ్చిన గేదెను గుర్తించక ఢీకొని ద్విచక్రవాహనదారుడు తీవ్ర గాయాలపాలయ్యాడు.

పరామర్శ



దామిశెట్టిని పరామర్శిస్తున్న రామిరెడ్డి

కావలి : ఇటీవల తల్లిని కోల్పోయిన పట్టణంలోని పాతూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కలవకూరి సుగుణకుమార్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అనంతరం పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దామిశెట్టి శ్రీనివాసులునాయుడు సోదరుడు మల్లికార్జునరావును పరామర్శించారు. ఇటీవ మల్లికార్జునరావుపై కొందరు దాడికి పాల్పడిన నేపథ్యంలో ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

నేటి నుంచి నట్టల నివారణ కార్యక్రమం

వరికుంటపాడు : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు పశువైద్యశాలల పరిధిలో మంగళవారం నుంచి పది రోజుల పాటు జీవాలకు నట్టల నివారణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ సోమవారం ఒక ప్రకటన తెలిపారు. రైతుసేవా కేంద్రాల పరిధిలోని గ్రామ పశువైద్య సహాయకులకు ఇప్పటికే నట్టల నివారణ మందును పంపిణీ చేశామని తెలిపారు. వీహెచ్ఏలు వారి పరిధిలోని జీవాలకు నట్టల నివారణ మందు అందజేస్తారని చెప్పారు. జీవాలపెంపకందారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ.2.36 కోట్లతో సిమెంట్‌రోడ్ల నిర్మాణం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

సీతారామపురం: మండలంలోని 14 పంచాయతీల్లో ఉపాధి నిధులు రూ.2.36 కోట్లతో సిమెంట్‌రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. మండలంలోని గుండుపల్లి, సీతారామపురం, ఏనుగులవారి కొట్టాలు, బసినేనిపల్లి, సంజీవరెడ్డినగర్ గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. డిసెంబరులోగా రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, పీఆర్ డీఈ మణికుమార్, ఏఈ తిరుమలయ్య, సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి, బిట్–2 ఎంపీటీసీ తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల పరిశీలన

ఉదయగిరి: స్థానిక ఆల్తూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం పరిశీలించారు. కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరుచేయాలని పలువురు వినతిపత్రం అందజేసిన నేపథ్యంలో కళాశాలను పరిశీలించి అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

వైభవంగా శ్రీవారి విగ్రహ ప్రతిష్ట

ఆత్మకూరురూరల్: సాతానుపల్లిలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత మహాగణపతి పూజ నిర్వహించారు. అనంతరం యంత్ర, వేంకటేశ్వరస్వామి, మహాగణపతి, ఆంజనేయుని విగ్రహాలను ప్రతిష్ట చేశారు.

ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆందోళన

ఉదయగిరి: ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఘాట్‌రోడ్డు కోతకు గురై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. దశాబ్ద కాలం నుంచి రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో ఉదయగిరికి వచ్చేందుకు కొండ కింద ఉన్న 12 గ్రామాల ప్రజలు అవస్థ పడుతున్నారన్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేదని వాపోయారు. నాయకులు మల్లికార్జున, లక్ష్మీనారాయణ, రమణయ్య పాల్గొన్నారు.

సీఐకు వినతి

ఆత్మకూరు: ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని పలువురు దళితులు తమ సమస్యలపై పోలీసు స్టేషన్లలో అర్జీలు అందజేశారని, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ మాజీ సభ్యులు కొప్పాల రఘు, శేషం సుదర్శన్ కోరారు. ఈ మేరకు ఆత్మకూరు సీఐ జీ గంగాధర్‌ను సోమవారం రాత్రి వారు కలిసి వినతిపత్రం అందజేశారు.

త్వరలో మున్సిపల్ ఎన్నికలు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి: కావలి మున్సిపల్ ఎన్నికలు డిసెంబర్ లేక జనవరిలో జరిగే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తన నివాసంలో 46 మందికి రూ.13లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీలో చౌదరిపాళెం పంచాయతీ విలీన ప్రక్రియను విరమించుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే జాప్యం లేకుండా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. అలాగే అల్లూరు నగర పంచాయతీని రద్దు చేస్తూ అల్లూరు, నార్త్‌మోపూరు, సింగపేటను పంచాయతీలుగా ప్రకటించాలనే ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. దీంతో చౌదరిపాళెంతో పాటు అల్లూరు, నార్త్‌మోపూరు, సింగపేట పంచాయతీలకు ఎన్నికలు జరిపేందుకు మార్గం సుగమమం అవుతుందన్నారు.

మద్యం అధిక రేట్లు, బెల్ట్‌షాపులను ఉపేక్షించం

మద్యం అధిక రేట్లకు విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. మద్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించినా, శాంత్రి భద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం షాపులతో కూటమి నాయకులకు సంబంధం లేదని, వ్యాపారులకు వ్యక్తుల నుంచి, వ్యాపారుల నుంచి ప్రజలకు ఏమైనా సమస్యలు వస్తే నేరుగా తన దృష్టికి తీసుకొస్తే ఎటువంటి చర్యలకైనా సిద్ధమని స్పష్టం చేశారు.

మద్యం షాపులను తొలగించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న మల్లి

కావలి: నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపులను తొలగించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి కోరారు. ఈ మేరకు కావలి ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు, బస్టాండ్‌లు, ఆలయాల వద్ద మద్యం షాపులను ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో బెల్టుషాపులను తెరిచి మద్యాన్ని ఏరులై పారించడం అన్యాయమన్నారు. మద్యం షాపులను నియంత్రించడంతో పాటు బెల్టుషాపులను తొలగించాలని కోరారు. స్పందించిన ఆర్డీఓ మాట్లాడుతూ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ద్వారా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, సీహెచ్ జనార్దన్, శ్యామ్‌సన్,ఎం మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న డీఎం శ్రీనివాసులు

కావలి: కావలి ఆర్టీసీ డిపోలో సోమవారం లక్కీడిప్‌ను తీశారు. సింగపేటకు చెందిన కడియంపాటి లక్ష్మి, సాయిపేటకు చెందిన శ్రీనిధి, సత్యవోలు అగ్రహారానికి చెందిన పేరారెడ్డి విజేతలుగా నిలవగా చీరలను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మాట్లాడుతూ డాక్టర్ రామస్వామి ఆస్పత్రి సహకారంతో లక్కీడిప్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతినెలా అల్లూరు, కొండాపురం, లింగసముద్రం రూట్లలో ప్రయాణించే ప్రయాణికుల్లో ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. లక్కీడిప్‌కు సహకారం అందిస్తున్న డాక్టర్ మంచికంటి రామస్వామికి ధన్యవాదాలు తెలిపారు. బస్‌స్టేషన్ మేనేజర్ రమేష్‌బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ డీ రవిప్రకాష్, ఏడీసీ పీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జైకా నిధులతో చెరువుల అభివృద్ధి

ఉదయగిరి: జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజెన్సీ (జైకా) నిధులతో ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలోని పలు గ్రామాల చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు ఇరిగేషన్ డీఈ కే చంద్రమౌళి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి చిన్న, పెద్ద చెరువులకు రూ.48 లక్షలు, గువ్వాడికి రూ.23 లక్షలు, ఇస్కపల్లికి రూ.27 లక్షలు, కృష్ణంపల్లికి రూ.32 లక్షలు, లింగమనేనిపల్లికి రూ.51 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

అల్లూరు: మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ వంశీకృష్ణ సోమవారం ఆకస్మికంగా తనఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వీఆర్వోలతో సమావేశమై రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

ఉదయగిరి: ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం సుభద్ర హెచ్చరించారు. మండలంలోని ఆర్లపడియలో సర్వే నంబర్లు 46, 47లో ఉన్న సుమారు 30 ఎకరాలను కొందరు ఆక్రమించి ట్రాక్టర్లతో చదును చేస్తున్నారని గ్రామస్తుల ఫిర్యాదు చేయడంతో సోమవారం ఆమె పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందితో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ఆమె వెంట ఆర్ఐ జీ సురేంద్ర, వీఆర్వో మస్తాన్ ఉన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

వింజమూరు(ఉదయగిరి): ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించి ఆటోలు నడుపుకోవాలని ఎస్సై వీరప్రతాప్ సూచించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు సోమవారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. వాహన, డ్రైవింగ్ లైసెన్సులు విధిగా కలిగి ఉండాలన్నారు. ఆటోలో నిర్దేశించిన మేరకు ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. మద్యం సేవించి ఆటో నడపడం, మితిమీరిన వేగంతో ప్రయాణించడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోలు నడిపితే కేసులు నమోదుచేస్తామని తెలిపారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు అజరామరం



ఆత్మకూరులో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ



కావలిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది



జలదంకిలో..



సీతారామపురంలో..



బిట్రగుంట: బోగోలులో..



వింజమూరులో..



చేజర్లలో..



అనుమసముద్రంపేటలో..

కావలి: దేశ రక్షణ, అంతర్గత శాంతిభద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసుల త్యాగాలు అజరామరమని కావలి వన్, టూ టౌన్ సీఐలు ఎండీ ఫిరోజ్, కే శ్రీనివాసరావు పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని కావలి వన్ టౌన్, టు టౌన్ పోలీస్ స్టేషన్ల వద్ద పోలీసు అమర వీరులకు పోలీసు సిబ్బంది సోమవారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ట్రంక్‌రోడ్డులో రెండు చోట్ల మావనహారం ఏర్పాటు చేసి పోలీసు అమరవీరుల త్యాగాలు ,పోలీసు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐలుమాట్లాడుతూ 1959 అక్టోబరు 21న భారత సరిహద్దు ప్రాంతం లద్దాక్ భూభాగంలో చైనా దురాక్రమణలకు పాల్పడిన సమయంలో తిప్పికొట్టే ప్రయత్నంలో అసువులు బాసిన వీరజవాన్లను స్మరించుకుంటూ ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని జరుపుకొంటున్నట్లు తెలిపారు.

బిట్రగుంట: బోగోలులో శాంతిభద్రతల పరిరక్షణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలను గుర్తుచేసేలా విద్యార్థులతో కలిసి పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పోలీసు సేవలపై అవగాహన కలిగించారు. ఎస్సై భోజ్యా మాట్లాడుతూ సమాజ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కృషిని వివరించారు.

ఉదయగిరి: ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఉదయగిరిలో విద్యార్థులతో కలిసి పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు.

వింజమూరు(ఉదయగిరి): ఎస్సై వీరప్రతాప్ ఆధ్వర్యంలో వింజమూరు పోలీసు స్టేషన్ నుంచి బంగ్లా సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు.

కలిగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి కలిగిరమ్మతల్లి ఆలయం వరకు విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానహారం చేపట్టి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. కలిగిరి సీఐ పీ వెంకటనారాయణ, ఎస్సై ఉమాశంకర్, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వరికుంటపాడు : స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్సై రఘునాథ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం పోలీసు స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు.

సీతారామపురం: ఎస్సై శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌వీఆర్ కళాశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు.

దుత్తలూరు: మండలంలోని బ్రహ్మేశ్వరంలో గ్రామస్తులతో కలిసి సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. మాజీ సర్పంచ్‌లు సూరె రమణారెడ్డి, వన్నూరి వెంకటరెడ్డి, నాయకులు కరాది వెంకటేశ్వరరెడ్డి, సూరె కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జలదంకి: ఎస్సై లతీఫ్‌ఉన్నీసా ఆధ్వర్యంలో జలదంకిలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. ఏఎస్సై హరిబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల సేవలు మరువలేనివని, వారిని నిత్యం స్మరించుకోవడం మన ధర్మమని ఆత్మకూరు డీఎస్పీ కె వేణుగోపాల్ పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన పోలీసు అమర వీరుల సంస్మరణ దినంలో ఆయన మాట్లాడారు. అనంతరం సీఐ జీ గంగాధర్, ఎస్సైలు షేక్ జిలానీ, కే సాయిప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పోలీసు సిబ్బంది పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ బస్టాండ్ ఆవరణలో మానవహారం ఏర్పాటు చేసి అమరులైన పోలీసుల సేవలను వివరించారు. తొలుత ర్యాలీని డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఆత్మకూరు డిపో మేనేజర్ ఎస్‌కే కరీమున్నీసా, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: ఎస్సై సైదులు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుంచి మెయిన్ బజారు మీదుగా నగారఖానా సెంటర్ వరకు పోలీసు సిబ్బంది స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. పోలీసుల అమర వీరుల ఆత్మశాంతికి కొద్దిసేపు మౌనం పాటించారు. ఏఎస్సై భాస్కర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక పోలీసు స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. తొలుత ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ పోలీస్ స్టేషన్ వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

చేజర్ల: ఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో చేజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీసుల సేవలపై అవగాహన కలిప్పించారు.



ఉదయగిరిలో..



కలిగిరిలో ..



సంగంలో..



వరికుంటపాడులో..